సాక్షి
నాగర్‌కర్నూల్
బుధవారం, 22, మార్చి, 2023



ఖాకీ నీడలో పనులు..

చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులు పోలీసుల నిఘా నీడలో కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



'అవినీతి రాజ్యమేలుతోంది'

బీఆర్ఎస్ పాలనలో అవినీతి రాజ్యమేలుతోందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.0 /22.0

వాతావరణం

ఉదయం చలి ఉండటంతోపాటు ఆకాశం తేలికపాటి మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం నుంచి సాధారణంగా మారుతుంది.

న్యూస్‌రీల్

అర్బన్ పార్క్ పనుల పరిశీలన



కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సోమశిల సమీపంలో ఫారెస్టు బీట్ వద్ద ఫారెస్టు చీఫ్ కన్జర్వేటర్, ఫీల్డ్ డైరెక్టర్ ఎస్.క్షితిజా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బీట్‌లో కొనసాగుతున్న అర్బన్ పార్క్ పనులను పరిశీలించారు. అనంతరం కృష్ణానది బ్యాక్ వాటర్‌లో పెట్రోలింగ్ నిర్వహించారు. అనంతరం సోమశిలలోని సోమేశ్వరుని కుటుంబ సమేతంగా ఫారెస్టు స్థానిక అధికారులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం ఇంజిన్ బోటులో వెళ్లి సంగమేశ్వరుని దర్శించుకున్నారు. అనంతరం సోమశిల వద్ద స్థానిక అధికారులతో అటవీ పరిరక్షణపై సమీక్షించారు. కార్యక్రమంలో రేంజర్ శరత్ చంద్రా రెడ్డి, బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని భీమలింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం విశ్వహిందూ పరిషత్, అచ్చంపేట సాహితీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనం ఆకట్టుకుంది. సనాతన ధర్మ రక్షణ ప్రతిఒక్కరి కర్తవ్యమని, తెలుగు సంవత్సరాది అయిన ఉగాది గొప్ప పండుగని పలువురు అన్నారు. కార్యక్రమంలో కవులు వెంకటేశ్వర శర్మ, బాల్‌నారాయణ, దామోదరశెట్టి, సుధాకరయ్య, రఘు, శ్రీధర్, రామోజీ, నాగేశ్వరరావు, బాలాజీ, బషీర్‌అహ్మద్, నర్సింహులు, సుచరిత, సాయిజ్యోతి పాల్గొన్నారు.

మానవ మనుగడకు చెట్లను రక్షించుకుందాం

మన్ననూర్: వృక్షాలను రక్షించుకున్నప్పుడే మానవ మనుగడ సుకాంతంగా సాగుతుందని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని అటవీశాఖ ఎఫ్‌బీఓ బాబలి అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా ఐసీఐసీఐ ఆధ్వర్యంలో అవగాహన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎఫ్‌బీఓ బాబలి, అటవీశాఖ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ స్వేత మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్నట్లు నేటి మొక్కలే పెరిగి రేపటికి మహా వృక్షాలు అవుతాయని అన్నారు. ప్రస్తుత కాలుష్య ప్రకృతిలో చెట్లను పెంచి, కాపాడుకోవడం ఎంతో అవసరమన్నారు. ప్రత్యేకించి అటవీ పరిసర ప్రాంతంలోని మనకు అడవులే రక్ష, అటవీ సంపదే మన వనరులని, అందు కోసం అడవులను కాపాడుకుందామన్నారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో అంతయ్య, లింగేశ్వర్, నర్సింహ, స్వాతి పాల్గొన్నారు.

శుభాలనిచ్చే.. శోభకృత్

- తెలుగు నామ సంవత్సరానికి స్వాగతం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- వ్యవసాయ పనులకు రైతన్నల శ్రీకారం
- కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిట
- నేడు ఉగాది పండుగ వేడుకలు



అచ్చంపేట: తెలుగు వారి ముఖ్యమైన పండుగ ఉగాది. ఉగాది అనే పదానికి యుగాది అనే సంస్కృత పదం మూలం. యుగాది అంటే యుగానికి అది లేక ప్రారంభం అని అర్థం. యుగానికి విస్తృత రూపమే ఉగము. దీని నుంచి పుట్టిందే ఉగాది. చాంద్రమాసంలో చైత్రశుద్ధ పాడ్యమిన ఉగాది పండుగ వస్తుంది. ఇంటిల్లిపాది తల స్నానం చేసి, కొత్త దుస్తులు ధరించి ఉగాది పచ్చడిని దేవుడికి నైవేద్యంగా పెట్టి ప్రసాదంగా తీసుకుంటారు. తమ జీవితాలు కూడా ఉగాది పచ్చడిలా షడ్రుచుల సమ్మేళనంగా ఉండాలని అకాంక్షిస్తారు. ఈ పండుగను ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ ఘనంగా జరుపుకొంటారు. నిన్నటితో శుభకృత నామ సంవత్సరం ముగియగా.. నేటితో శ్రీశోభకృత్ నామ సంవత్సరం ప్రారంభం కానుంది.

రైతులు సిద్ధం..

జిల్లా వ్యాప్తంగా శ్రీశోభకృత నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని జరుపుకొనేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఉగాది పర్వదినాన్ని ప్రజలు కొత్త పనుల ప్రారంభానికి శుభదినంగా భావిస్తారు. ఉమ్మడి జిల్లాలో విభిన్న సంస్కృతుల ప్రజలు ఉగాది పండుగను ఎవరికి వారే భిన్నంగా జరుపుకొంటారు. రైతులంతా ఒకే సంప్రదాయాన్ని పాటించి ఉగాది రోజునే వానాకాలం పనులకు శ్రీకారం చుడుతారు. వ్యవసాయంతో ప్రధాన పాత్ర పోషించే పశువులకు ముకుతాడు వేస్తారు. భూమి పూజ చేస్తారు. అనంతరం అరక దున్నుతారు. దీన్నే అరక తోలుకోవడం అంటారు.

బ్రహ్మముహూర్తంలో నైవేద్యం..

రైతులు బ్రహ్మముహూర్తంలో నైవేద్యం వండుకుని పొలాల్లోకి వెళ్తారు. శమీ వృక్షానికి, వ్యవసాయ పరికరాలకు, బసవన్నలకు ప్రత్యేక పూజలు చేస్తారు. పెరుగన్నం నైవేద్యంగా సమర్పించి సూర్యోదయానికి ముందే ఈ తంతు ముగిస్తారు. అనంతరం అరక కట్టి ఐదుసార్లు దుక్కి దున్నుతారు. అనంతరం ఇంటికి వచ్చి షడ్రుచులతో చేసిన ఉగాది పచ్చడిని ఆరగిస్తారు.

మట్టి కుండలు, మామిడికాయలు..

నూతన వస్త్రాలు, పిండి వంటలకు కావాల్సిన వస్తువులు మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. ఉగాది పచ్చడికి అవసరమైన మట్టి కుండలు, మామిడికాయలు, బెల్లం, వేప పూత, కొత్తచింతపండు, మామిడి తోరణాలు విక్రయిస్తున్నారు.

పంచాంగ శ్రవణం..

మనిషి తన శక్తి సామర్థ్యాలపై ముందుకు సాగుతున్నా.. దైవానుగ్రహం కూడా ఉండాలని నమ్ముతాడు. ఏపని చేయాలన్నా తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే ఐదు భాగాలను కలిపి పంచాంగం అంటారు. మనిషి చేసే పనుల్లో విజయాన్ని అకాంక్షించే వారు ఉగాది నాడు పంచాంగం చూసుకుంటారు. తిథితో సంపద, వారంతో అనుకూలతను, నక్షత్రంతో పాపపరిహారం, సరైన యోగంతో వ్యాధి నివారణ, కరణం ద్వారా కార్యానుకూలత పొందవచ్చు. గ్రామాల్లోని ప్రతి ఆలయంలో ఉగాది రోజు పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. రైతులు, వ్యాపారులు వారి రాశి ఫలాలను పరిక్షించుకుంటారు.

చిరుధాన్యాల వినియోగం, లాభాలపై అవగాహన



పోషణ్ పక్వాడా వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కందనూలు: జిల్లా స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు పోషణ్ అభియాన్‌లో భాగంగా నిర్వహించే పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ అన్నారు. అందుకు లైన్ డిపార్ట్‌మెంట్లు వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యా తదితర శాఖలు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో రక్త హీనత, ఇతర జబ్బులను అరికట్టడానికి పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పక్షం రోజులు పోషణ్ అభియాన్‌లో ప్రతి అంగన్‌వాడీ సెంటర్ ద్వారా 5 సంవత్సరాల లోపు పిల్లలు, ప్రతిఒక్కరికి ఖచ్చితమైన బరువు, కొలతలు తీసి రిజిష్టరులో నమోదు చేసి, ఆన్‌లైన్ చెసేలా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. పిల్లలు, గర్భిణిలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం, 6 నెలల నుంచి 3 సంవత్సరాలలోపు పిల్లలకు టెక్ హోమ్, రేషన్ వివరాలు అప్‌డేట్ చేయడం వంటి కార్యక్రమాలను లక్ష్యంగా పెట్టుకొని వందశాతం ఖచ్చితత్వంతో పూర్తి చేయాలన్నారు.

న్యూట్రీ గార్డెన్ ఏర్పాటుకు..

తెలంగాణకు హరితహారంలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో, ప్రతి పాఠశాల, కళాశాల, గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటుకు కావాల్సిన మట్టి, మొక్కలు ఇతర సదుపాయాలు కల్పించే బాధ్యతను పంచాయతీరాజ్ శాఖకు అప్పగిస్తూ.. డీపీఓకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు, చిన్నారులు చేతిని శుభ్రంగా కడుక్కునే నైపుణ్య శిక్షణ, పారిశుద్ధ్యం, పౌష్టికాహారం, బాల్యవివాహాల నిర్మూలన, మహిళలకు ఉపాధి అవకాశాలు వంటి కార్యక్రమాలపై స్వయం, సహాయక సంఘాల మహిళలకు, గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించే బాధ్యతలను అధికారులకు అప్పగించారు. కౌమార దశ అమ్మాయిలు, గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎంతమంది రక్తహీనతతో బాధపడుతున్నారో నివేదిక రూపొందించాల్సిందిగా ఆదేశించారు. ఈ పక్షం రోజులు గ్రామాల్లో అంగన్‌వాడీల ద్వారా ఏర్పాటు చేసే పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనకు కావాల్సిన ధాన్యాలు అందించాల్సిన బాధ్యతను వ్యవసాయ, మార్కెటింగ్ శాఖకు అప్పగించారు. అనంతరం పోషణ్ పక్వాడా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి, డీపీఓ కృష్ణ, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, రవి నాయక్, శ్రీధర్, భాగ్యలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

జిల్లా ప్రజలకు కలెక్టర్ ఉదయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మావతి వేర్వేరుగా మంగళవారం ఒక ప్రకటనలో తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో తీపి, చేదు షడ్రుచులు కలగలిపి ఆస్వాదిస్తూ శాంతి సౌభాగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఎండల వేడి దృష్ట్యా ప్రజలు ఉదయం 11 గంటల వరకే తమ పనులు ముగించుకుని ఇంటికి వచ్చేయాలని, అత్యవసరమైతేనే బయటికి రావాలని, వచ్చే టప్పుడు గొడుగులు, నెత్తికి టోపి ఉపయోగించాలని చెప్పారు. క్రమం తప్పకుండా మంచినీళ్లు తాగాలని, ఒడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జనచైతన్య బస్సుయాత్రను జయప్రదం చేయండి



బస్సుయాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: బీజేపీ మతోన్మాద కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన జనచైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మంగళవారం నాగర్‌కర్నూల్ సీపీఎం పార్టీ కార్యాలయంలో బస్సు యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రపంచ మానవ అభివృద్ధి ఆకలి సంచికలో భారతదేశం 141వ స్థానానికి దిగజారిందని, విద్యలో 30వ స్థానాన్ని సంపాదించిందన్నారు. పోరాడి సాధించుకున్న రిజర్వేషన్లను కేంద్రం నీరుగార్చేందుకు పూనుకుందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా మతోన్మాద విభజన రాజకీయాలతో అధికారంలోకి రావాలని చూస్తుందని, ఆ విధానాలను అడ్డుకుంటామన్నారు. ఈ నెల 28న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, కార్యదర్శులు ఆంజనేయులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల నిర్వహణపై శిక్షణ

కందనూలు: ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల పాఠశాలలో ప్రారంభించిన గ్రంథాలయ నిర్వహణ శిక్షణ కార్యక్రమం, జిల్లాలో 150 పాఠశాలలో మొదటి ఫేజ్ శిక్షణ కార్యక్రమం పూర్తయిందని డీఈఓ గోవిందరాజులు తెలియజేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 50 మంది ఉపాధ్యాయులకు 'ఒక రోజు గ్రంథాలయం నిర్వహణ, పఠన వ్యూహాలు, మార్గదర్శకాలు' అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడారు. పిల్లల్లో గ్రంథాలయాల నిర్వహణ, సరిగ్గా జరిగితే పిల్లల్లో చదవడం బాగా అభివృద్ధి జరుగుతుందన్నారు. పాఠశాల స్థాయిలోనే ఈ కార్యక్రమం విజయవంతం చేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన గ్రంథాలయ పుస్తకాలు, ఇతర వస్తువులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ వెంకటయ్య, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్మయ్య, రిసోర్స్ పర్సన్ లక్ష్మీనరసింహారావు, మణికంఠ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గ్రంథాలయాల నిర్వహణ శిక్షణలో మెటీరియల్ ఆవిష్కరిస్తున్న డీఈఓ గోవిందరాజులు

పరీక్షలు సరే.. శస్త్రచికిత్సలేవీ?

- కంటివెలుగులో అద్దాల పంపిణీకే పరిమితం
- ఇప్పటి వరకు 3,07,884 మందికి కంటి పరీక్షలు

నాగర్‌కర్నూల్ క్రైం: రాష్ట్ర వ్యాప్తంగా అంధత్వ నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగు శిబిరం జిల్లాలో కొనసాగుతుంది. జనవరి 18న ప్రారంభమైన రెండో విడత కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణలో సాగుతుంది. కంటి పరీక్షలు నిర్వహించిన వైద్యసిబ్బంది చాలా మందికి అప్పటికప్పుడే కంటి అద్దాలు పంపిణీ చేయడం, మరికొందరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి 15 రోజుల తర్వాత కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నారు.

■ ఇంతవరకు బాగానే ఉన్నా.. క్యాటరాక్ట్ పొరతో పాటు ఇతర కంటి సమస్యలు ఉన్న వారికి కంటి ఆపరేషన్ చేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు నిరాశకు గురవుతున్నారు. కంటి ఆపరేషన్ అవసరం ఉన్నవారి వివరాలు కేవలం ఆన్‌లైన్‌లో నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారు.

జిల్లాలో 50 శిబిరాలు

జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లో 50 కంటివెలుగు శిబిరాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 3,07,884 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

ఇందులో పురుషులు 1,48,728 మంది ఉండగా.. 1,59,728 మంది మహిళలు ఉన్నారు. పురుషుల కంటే మహిళలే అధికంగా కంటిపరీక్షలు చేయించుకున్నట్లు వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. ఇందులో 40 ఏళ్ల లోపు 4,375 మందికి, 40 ఏళ్లు పైబడిన 25,801 మందికి దగ్గరిచూపు సమస్య ఉన్నట్లు గుర్తించి అద్దాలు పంపిణీ చేశారు. 21,738 మందికి దూరపుచూపు సమస్యను గుర్తించి 9453 మందికి అద్దాలు ఇవ్వగా.. 12,285 మందికి అద్దాలు ఇవ్వాల్సి ఉంది. కాగా జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు పరీక్షల్లో 9,800 మందికి కంటి శస్త్రచికిత్సలు, అవసరం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇంకా నెలరోజుల పాటు కంటి శిబిరాలు కొనసాగనుండటంతో శస్త్రచికిత్సలు చేయించుకునే వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.



బిజినేపల్లిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అద్దాల పంపిణీ	అద్దాలు పంపిణీ చేయాల్సినవి
9,453	12,285
శస్త్రచికిత్సలు అవసరమయ్యేవారి గుర్తింపు 9,800	

ఆర్థిక భారంతోనే..

కంటి పరీక్షలు చేయించుకునేందుకు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే.. కంటి అద్దాలు తీసుకోవాలన్నా.. పరీక్షలు చేయించుకోవాలన్నా.. శస్త్ర చికిత్సలు చేయించుకోవాలన్నా.. రూ. వేలు ఖర్చవుతుండటంతో ఎక్కువ శాతం ప్రజలు కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకుని అద్దాలు తీసుకుంటున్నారు. శస్త్రచికిత్సలు అవసరం ఉన్న వారి వివరాలు సేకరించడం ఆన్‌లైన్ వరకు మాత్రమే పరిమితం చేయడంతో నిరుపేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకునేందుకు రూ.20 వేల నుంచి రూ.30 వేలు వరకు ఖర్చవుతుండటంతో వారిలో ఆందోళన నెలకొంది. జిల్లాలో 9,800 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శస్త్రచికిత్సలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు .

చర్యలు తీసుకుంటాం..



రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. ఇప్పటి వరకు పరీక్షలు నిర్వహించి అద్దాలు ఇస్తున్నాం. కంటి ఆపరేషన్లు అవసరమయ్యే వారి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తే కంటి ఆపరేషన్లు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ కంటిపరీక్షలు చేయించుకోవాలి.

– డా.సుధాకర్‌లాల్, డీఎంహెచ్ఓ, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన బొలెరో: యువకుడి దుర్మరణం


దీపక్ (ఫైల్)

జడ్చర్ల: పండుగ పూట విషాదం అలుముకుంది. మరికొద్ది సేపట్లో సొంత ఊరుకు బయలుదేరి వెళ్తుండగా మోటార్‌బైక్‌ను ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఎస్‌ఐ లెనిన్ కథనం ప్రకారం.. మండలంలోని పోలేపల్లి సెజ్‌లో ఇండోవేర్ పరిశ్రమలో దీపక్(21) పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం దీపక్, ప్రశాంత్ ద్విచక్రవాహనంపై సెజ్‌లో నుంచి జాతీయ రహదారిపైకి మాచారం వైపు వస్తుండగా మూల మలుపు వద్ద ఎదురుగా వచ్చిన బొలెరో ఢీకొట్టడంతో దీపక్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెనక కూర్చున్న ప్రశాంత్ గాయపడటంతో ఆస్పత్రికి తరలించారు. దీపక్‌ది వికారాబాద్ జిల్లా పరిగి మండలం దోమ గ్రామంగా గుర్తించారు. తల్లిదండ్రులు భాగ్యమ్మ, నర్సింహులుకు దీపక్ ఒక్కగానొక్క కుమారుడు అని బంధువులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాదాద్రిలో అమరచింత యువకుడి మృతి

- పుష్కరిణిలో ఘటన
- గిడ్డంగుల చైర్మన్ సాయంతో స్వగ్రామానికి మృతదేహం


మౌలాలి (ఫైల్)

అమరచింత: అమరచింతకు చెందిన మతిస్థిమితం లేని యువకుడు యాదాద్రిలోని పుష్కరిణిలో మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఆ వివరాలు.. పట్టణానికి చెందిన ఖాజాబాను, మతిస్థిమితం లేని తన పెద్ద కుమారుడు మౌలాలి(19)తో కలిసి సోమవారం యాదాద్రి వెళ్లారు. పుష్కరిణిలో స్నానం చేయడానికి దిగారు. నీళ్లు చల్లగా ఉండటంతో మౌలాలికి ఫిట్స్ వచ్చాయి. నీటిలో పడిపోయాడు. పక్కనున్న వారు గమనించి బయటికి తీసేలోగా మృతిచెందాడు. అనారోగ్య పరిస్థితి నుంచి కొడుకు త్వరగా కోలుకోవాలని మూడేళ్లుగా ఖాజాబాను యాదాద్రికి వెళ్లివస్తోంది.

గిడ్డంగుల చైర్మన్ సహాయంతో..

విషయం తెలియడంతో రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని అమరచింతకు తరలించేందుకు తనవంతు సహకారం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో తరలించారు. కుటుంబాన్ని ఆదుకుంటామని ఖాజాబానుకు హామీ ఇచ్చారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

బాలానగర్: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ నెల 17న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లింది. దీంతో తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ జయప్రసాద్ తెలియజేశారు. మృతిని వివరాలు తెలిసిన వ్యక్తులు బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆలయంలో బంగారు ఆభరణాలు అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం: ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని టీచర్స్‌కాలనీ వేంకటేశ్వర స్వామికి నైవేద్యం సమర్పించేందుకు మంగళవారం ఉదయం అర్చకుడు ప్రసాదం తీసుకువచ్చేందుకు ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆలయానికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి దేవతా మూర్తుల మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసి పరారయ్యాడు. ఈ విషయమై అర్చకుడు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి వచ్చి వివరాలు సేకరించారు. ఆలయ కోశాధికారి పరమేశ్వరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

23 తులాల బంగారు ఆభరణాలు..

జడ్చర్ల: ఇచ్చిన డబ్బులు అడగడానికి వచ్చిన ఓ మహిళ ఇంట్లో దాచిన బంగారు ఆభరణాలను అపహరించిన జడ్చర్లలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. జడ్చర్లలోని వెంకటేశ్వరకాలనీలో నివాసం ఉంటున్న షాజియాబేగం మధ్యవర్తిగా తన తల్లి షహనాజ్‌బేగంకు తన చిన్నమ్మ ఫరనాజ్ నుంచి రూ.5 లక్షలు అప్పుగా ఇప్పించింది. అయితే నిర్ణీత కాలంలో డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ జడ్చర్లలోని షాజియాబేగం ఇంటికి ఫరనాజ్ వచ్చేది. ఈ క్రమంలోనే గత నెల 28న షాజియాబేగం ఇంటికి ఫరనాజ్ వచ్చి వెళ్లింది. ఆ తర్వాత మార్చి 1న తన ఇంట్లో కప్ బోర్డును తెరచి చూడగా అందులో దాచిన 23 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. అనుమానంతో తన చిన్నమ్మ ఫరనాజ్‌ను అడగగా తానే డబ్బులు అడగడానికి వచ్చిన సమయంలో ఆభరణాలను తీసుకెళ్లినట్లు తెలిపింది. తన ఆభరణాలు ఇవ్వాలని కోరినా ఇవ్వడం లేదని, ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకుని తన నగలు ఇప్పించాలని బాధితురాలు మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


చాగదోన నుంచి పొలాలకు వెళ్తున్న వారిని విచారిస్తున్న పోలీసులు


పునరావాస కేంద్రంలో పిల్లర్ స్థాయిలో ఆగిన పాఠశాల భవనం

ఖాకీ నీడలో పనులు..

- చిన్నోనిపల్లె రిజర్వాయర్ వద్ద పర్యవేక్షణ
- పోలీసుల అదుపులో మరో 9మంది
- ఎక్కడున్నారో తెలియనివ్వడం లేదంటూ కుటుంబసభ్యుల ఆందోళన
- పునరావాస కేంద్రంలో సౌకర్యాలు లేమి

గట్టు: చిన్నోనిపల్లె నిర్వాసిత కుటుంబాల్లో ఆందోళన తొలగిపోలేదు. రిజర్వాయర్ రద్దు కోసం ఏడాది కాలంగా పోరాటం చేస్తున్న నిర్వాసిత కుటుంబాలకు చెందిన కొందరిని మూడ్రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసన దీక్షలో పాల్గొంచుకున్న వారిని బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా పోలీసులు అదుపులో ఉంచుకున్నారు. తమ వారు ఎక్కడున్నారో తెలియక చిన్నోనిపల్లె, ఇందువాసి గ్రామాలకు చెందిన నిర్వాసిత కుటుంబాల సభ్యులు మరింత ఆందోళన చెందుతున్నారు. కేసులు పెట్టక, బయటకు వదిలేయక రిజర్వాయర్ రద్దు కోసం పోరాటం చేస్తున్న వారికి నరకం చూపిస్తున్నట్లు నిర్వాసిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ 421 రోజులుగా నిరసన దీక్షను చేపట్టినప్పటికీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా, ఆందోళన చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని పోలీసు బలగాల మోహరింపుతో రిజర్వాయర్ పనులు ప్రారంభించారని, పనులకు ఆటంకం కలిగించకుండా తాము కూడా దూరంగా ఉంటున్నప్పటికీ తమ వారిని ఎందుకు విడిచిపెట్టడం లేదని నిర్వాసిత కుటుంబాలకు చెందిన వారు ఆరోపిస్తున్నారు.

జోరుగా పనులు..

చిన్నోనిపల్లె రిజర్వాయర్ పనులు జోరుగా కొనసాగిస్తున్నారు. పనులకు అవసరమైన యంత్రాలను ఇతర ప్రాంతాల నుంచి చిన్నోనిపల్లెకు ప్రత్యేక వాహనాల్లో తెప్పించారు. పనులు జరిగే చోట పోలీసులు టెంట్లు వేసుకుని పర్యవేక్షణ


చిన్నోనిపల్లి వద్ద కొనసాగుతున్న పనులు

చేస్తున్నారు. చిన్నోనిపల్లె వాగు దగ్గర వదిలేసిన గ్యాప్‌ను పూడ్చే పనులు చేపట్టారు. ఈ గ్యాప్‌ను పూడ్చితే వర్షపు నీరు రిజర్వాయర్ దాటి బయటకు వెళ్లడానికి అవకాశం ఉండదు. ఇలా రిజర్వాయర్‌లో వాగుల ద్వారా వచ్చిన వర్షపు నీరు ఇళ్లలోకి చేరే అవకాశం ఉంది. గ్యాపును పూడ్చితే ఊరు ఖాళీ చేయకతప్పదు. చాగదోన, బోయలగూడెం, లింగాపురం, అంతంపల్లి, ఇందువాసి గ్రామాల నుంచి చిన్నోనిపల్లె గ్రామానికి వచ్చే రోడ్లవెంట బారికేడ్లతో పోలీసులు పహారా కాస్తున్నారు. కొత్త వారిని గ్రామం వైపు రానివ్వడంలేదు. కట్టుదిట్టమైన పోలీస్ భద్రతను ఏర్పాటు చేశారు.

సౌకర్యాలేవీ..

చిన్నోనిపల్లె పునరావాస కేంద్రంలో సౌకర్యాలు లేవని ముంపు గ్రామస్తులు అంటున్నారు. చిన్నోనిపల్లె గ్రామానికి దూరంగా యర్రగట్టు దగ్గర అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం సమస్యలు తిష్ట వేసినట్లు ముంపు గ్రామస్తులు తెలిపారు. పునరావాస కేంద్రంలో ఎలాంటి సౌకర్యాలు లేవని, అక్కడికి వెళ్లి ఎలా ఉండాలని నిర్వాసిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఇళ్ల నిర్మాణానికి అనుకూలంగా లేనిచోట ఇళ్లు ఎలా కట్టుకోవాలని వాపోతున్నారు. పునరావాస కేంద్రంలో ముళ్లకంప, పిచ్చిమొక్కలు మొలిచాయి. పాఠశాల కోసం చేపట్టిన పనులు పిల్లర్ దశలోనే నిలిచిపోయాయి. మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు ప్రారంభించకుండానే కూలడానికి సిద్ధంగా ఉన్నట్లు నిర్వాసిత కుటుంబాల వారు ఆరోపిస్తున్నారు.

పోలీసుల అదుపులో 9 మంది..

చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ చాగదోన, చిన్నోనిపల్లె, లింగాపురం, ఇందువాసి, బోయలగూడెం గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులు 421 రోజులుగా ఆందోళన చేస్తూ వచ్చారు. శనివారం అర్ధరాత్రి నిరసన దీక్ష చేస్తున్న 22మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని అదేరోజు అర్ధరాత్రి గట్టు తహసీల్దార్ ముందు బైండోవర్ చేయగా, ఇందులో చాలామంది రైతులు సంతకాలు చేయడానికి నిరాకరించడంతో కొందరిని మాత్రమే బైండోవర్ చేసి, మిగతా వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గట్టు నుంచి శాంతినగర్ పోలీస్ స్టేషన్‌కు మళ్లీ అక్కడి నుంచి ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌కు నిరసన దీక్షలు చేస్తున్న నిర్వాసిత కుటుంబాల వారిని పోలీసులు తరలించారు. ఇందులో ఆరుగురిని అప్పుడే వదిలేశారు. మరో ఏడుగురిని సోమవారం రాత్రి వదిలేశారు. మిగతా 9మందిని మాత్రం పోలీసుల అదుపులోనే ఉంచారు. కుటుంబసభ్యులతో మాట్లాడనీయకుండా ఫోన్లు లాక్కున్నారని నిర్వాసిత కుటుంబ సభ్యులు ఆరోపించారు.

ప్లాంటును రద్దు చేయాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి ఇస్తున్న ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

నర్వ: మరికల్ మండలం చిత్తనూర్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కంపెనీ, 15 మైక్రో వ్యాట్స్ విద్యుత్ కోజనరేషన్ ప్లాంటును వెంటనే రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నర్వలో ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. కంపెనీ ఏర్పాటు వల్ల భూమి కాలుష్యం, గాలికాలుష్యం అయి వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. ఇథనాల్ ఉత్పత్తి మొదలైతే ఆహారధాన్యాల కొరత తీవ్రమవుతుందన్నారు. కంపెనీ కాలుష్యంతో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతారన్నారు. కంపెనీ వ్యర్థాల వల్ల మన్నెవాగు, ఊకచెట్టువాగు, రామన్‌పాడు డ్యాం, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు జలాలు కలుషితమవుతాయన్నారు. ఈ కంపెనీ ఏర్పాటు గ్రామాల మధ్యన ఉండడంతో తక్షణంగా 54 గ్రామాలు, దీర్ఘకాలికంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకే ప్రమాదకరంగా మారనుందన్నారు. జీవించే హక్కును హరిస్తున్న ఇథనాల్ కంపెనీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ రద్దు కోసం 11రోజుల పాటు పాదయాత్రను చేపట్టి విజయవంతం చేశామన్నారు. పోరాటాన్ని జీర్ణించుకోలేక యాజమాన్యం కుట్రపూరితంగా చిత్తనూర్ మహిళలను అవమానపరిచి దాడులకు తెగబడ్డారన్నారు. అవమానపరిచిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ కంపెనీ రద్దు చేసేవరకు ఈ ఉద్యమం ఆగదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ కాళప్పకు వినతిపత్రం అందించారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చక్రవర్తి, జిల్లా నాయకులు వెంకట్రాములు, డి.చంద్రశేఖర్, నాగేష్, ఖలీల్, రాంపురం నాగరాజు, వామన్‌కుమార్, గుడిసె వెంకటయ్య, మహేందర్, ఈశ్వర్, శ్రీదేవి పాల్గొన్నారు.

జడ్చర్ల డిగ్రీ కళాశాలకు బీ++గ్రేడ్

జడ్చర్ల టౌన్: స్థానిక బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలకు ప్రస్తుతం ఉన్న బీ++ప్లస్ గ్రేడ్ కొనసాగించారు. గత వారం ముగ్గురు సభ్యులున్న న్యాక్ బృందం రెండు రోజుల పాటు కళాశాలలో పర్యటించి మార్కులు వేసింది. వాటి ఆధారంగా యూజీసీ బీడబుల్‌ప్లస్ గ్రేడ్ కేటాయించింది. గతంలో ఉన్న గ్రేడ్‌నే కొనసాగించడంపై పూర్వ విద్యార్థులు, అధ్యాపకబృందం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈసారి ఏగ్రేడ్ వస్తుందని ఆశించినప్పటికీ నిరాశే మిగిలింది. కళాశాలలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సక్రమంగా లేవని, యోగ ట్రైనర్, డాక్టర్లు లేరని, క్రీడలకు సంబంధించి పురోగతి లేదనే పలు అంశాలపై న్యాక్ బృందం అసంతృప్తి వ్యక్తం చేయటంతో డబుల్‌ప్లస్ గ్రేడ్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వాస్తవానికి రాష్ట్రంలో బీఆర్‌ఆర్ డిగ్రీకళాశాలలో ఉన్న సౌకర్యాలు, వసతులు మరే కళాశాలలో లేకపోయినప్పటికీ న్యాక్‌బృందం తక్కువ మార్కులు వేయటంతో విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

డివైడర్ ధ్వంసంపై ఫిర్యాదు

జడ్చర్ల: పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయ సమీపంలో ఓ లారీ రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి ఆస్తినష్టం సంభవించిందని స్థానిక మున్సిపల్ కార్యాలయ ఉద్యోగి శివకుమార్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశా రు. లారీ రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టడంతో రేలింగ్ ధ్వంసం కావడంతోపాటు పూలమొక్కల కుండీలు, 2 సీసీ కెమెరాలు, బటర్ ఫ్లైలైట్లు, విద్యుత్ తీగలు తదితర రూ.1.50 లక్షల ఆస్తినష్టం సంభవించిందని, బాధ్యులపై చర్యలు తీసుకుని నష్టపరిహారం ఇప్పించాలని ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.

ఎమ్మెల్యే కమీషన్ల కోసమే రిజర్వాయర్ పనులు

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ


మాట్లాడుతున్న డీకే అరుణ

గద్వాల: రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులకు పార్టీపరంగా డబ్బులు సమకూర్చడం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులను పునఃప్రారంభించిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. బీఆర్‌ఎస్ కమీషన్ల పార్టీ అని ధ్వజమెత్తారు. రిజర్వాయర్ పనులు చేపట్టే కాంట్రాక్టర్ ద్వారా ఎమ్మెల్యే అభ్యర్థులకు కమీషన్ ఇప్పించి, తద్వారా ఆ డబ్బుతో ఓట్లను కొనుగోలు చేయడానికి ప్లాన్ చేశారని ఆరోపించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కరీంనగర్ జిల్లాలోని తోటపల్లి రిజర్వాయర్‌ను రద్దు చేసిన తరహాలోనే, చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్ధరాత్రి పోలీసు బలగాలతో దౌర్జన్యంగా నిర్వాసిత కుటుంబాలను ఖాళీ చేయించారని మండిపడ్డారు. టెర్రరిస్టుల మాదిరిగా రైతులను మూడు రోజులుగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతూ భయాందోళనకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ రద్దు కోసం నిర్వాసితులు 422 రోజుల పాటు చేపట్టిన దీక్షలు ప్రభుత్వానికి కనిపించలేదా అని ప్రశ్నించారు. తొమ్మిదేళ్లుగా ఆర్ అండ్‌ఆర్ సెంటర్‌లో కనీస సౌకర్యాలు కల్పించలేదని వాపోయారు. ఆర్డీఎస్‌కు కేటాయించిన నీటిని వినియోగించుకోకుండా, చిన్నోనిపల్లి రిజర్వాయర్ ద్వారా నీటిని తరలించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. గద్వాల, అలంపూర్ ప్రాంతాల రైతుల మధ్య చిచ్చుపెట్టడానికే రిజర్వాయర్ పనులు చేస్తున్నారని ఆరోపించారు. అదుపులో తీసుకున్న రైతులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో అభ్యర్థి గెలుపు కోసం తీవ్రంగా శ్రమించిన డీకే అరుణను ఈ సందర్భంగా పార్టీ నాయకులు పెద్దగజమాలతో సన్మానించారు. గెలుపుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు రామచంద్రారెడ్డి, గద్దం కృష్ణరెడ్డి, రామాంజనేయులు, బండల వెంకట్రాములు, మధుసూదన్ రావు పాల్గొన్నారు.

రిజర్వాయర్ నుంచి కంకర, ఇసుక చోరీ

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంట్రాక్టర్


రిజర్వాయర్ దగ్గర ఉన్న కంకరను ఓ ట్రాక్టర్‌లో నింపుతున్న జేసీబీ

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ నేరేడ్ చెరువు రిజర్వాయర్ దగ్గర ఉన్న కంకర, ఇసుకతోపాటు ఇతర సామగ్రిని కొందరు వ్యక్తులు చోరీ చేశారని కాంట్రాక్టర్ బాల్‌చంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. రిజర్వాయర్ దగ్గర చేసిన పనులకు సంబంధించి రెండేళ్లుగా బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశానని, ఇదే అదునుగా చుట్టు గ్రామం, తండాలకు చెందినవారు సుమారు రూ.20 లక్షల విలువ చేసే కంకర, రూ.10 లక్షల విలువ చేసే ఇసుకతోపాటు ఒక టీవీ, రెండు వెల్డింగ్ మిషన్లు, గ్యాస్ సిలిండర్ ఎత్తుకెళ్లారని ఆరోపించారు. ఈ విషయమై ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌లో తమ సిబ్బంది ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై ఖిల్లాఘనపురం ఎస్‌ఐ శ్రీహరి స్పందిస్తూ రాతపూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫోన్‌లో సమాచారం ఇచ్చారని చెప్పారు. ప్రస్తుతానికి వివరాలు తెలుసుకుంటున్నామని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం


పెద్దకొత్తపల్లిలో ఒకరోజు నిరాహార దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

పెద్దకొత్తపల్లి: టీఎస్‌పీఎస్సీలో లీకైన ప్రశ్నపత్రాల కేసును సీబీఐకి అప్పగించడంతోపాటు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పట్టభద్రుల నిరుద్యోగ సంఘం ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ ఆధ్వర్యంలో పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్ల రవి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను వెంటనే సస్పెండ్ చేయాలని, 40 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలన్నారు. ప్రభుత్వ పెద్దల హస్తం లేకుండా ప్రశ్నపత్రాల లీక్ సాధ్యం కాదని, ఇందుకు తెరవెనక సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో జరగబోయే అన్ని పరీక్షలకు ఎలాంటి లీకుల బెడద లేకుండా నిరుద్యోగులకు ఏ రకమైన నమ్మకాన్ని కల్పిస్తుందో ప్రభుత్వం చెప్పాలని నిలదీశారు. నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్, అవినాష్‌గౌడ్, విష్ణు, జంగయ్య, సూర్యం, కుర్మయ్య, సాయిబాబు, వికార్, శ్రీను, రామకృష్ణ, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీకొన్న కారు

- ఇద్దరు విద్యార్థులకు గాయాలు


స్కూల్ బస్సును రోడ్డుపై నుంచి పక్కకు తొలగిస్తున్న క్రేన్

అలంపూర్: జాతీయ రహదారిపై స్కూల్ బస్సును కారు ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. అలంపూర్ చౌరస్తాలోని ప్రయాగ్ పాఠశాలకు చెందిన బస్సు మధ్యాహ్నం విద్యార్థులను ఎక్కించుకొని టోల్‌ప్లాజా వద్ద ఉన్న స్కంధ కాలనీకి బయల్దేరింది. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు అదే మార్గంలో వస్తున్న కారు వెనక నుంచి ఢీకొనడంతో బస్సులో ఉన్న మనీషారెడ్డి, దీక్షిత్ అనే విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే విద్యార్థులను హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న స్కూల్ బస్సును క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఉండవెల్లి ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం


కాలిన పత్తిని బయటకు తీస్తున్న రైతు

మరికల్: మండలంలోని అప్పంపల్లిలో ఇంట్లో నిల్వ చేసిన పత్తి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. పత్తి ధరలు లేకపోవడంతో అప్పంపల్లికి చెందిన మాడిగమోని చంద్రన్న దాదాపు 25 క్వింటాళ్ల పత్తిని తన ఇంట్లో నిల్వ చేసుకున్నాడు. మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. పత్తి సంచుల నుంచి పొగ రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు నీళ్లు చల్లి పత్తి బస్తాలను బయటకు తీశారు. అప్పటికే దాదాపు 10 క్వింటాళ్ల పత్తి కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తరుణంలో పత్తి కాలిపోవడంతో బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అప్పులు చేసి సాగు చేసి పంటకు ధర పెరుగుతుందనే ఆశతో ఇంట్లో నిల్వ చేసుకుంటే ఇలా కాలిపోవడంతో రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ పరంగా బాధిత రైతును ఆదుకోవాలని తోటి రైతులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



జడ్చర్ల: మండలంలోని కోడ్గల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ యూసూఫ్ పట్టుకున్నారు. ఓ ఆటోలో రేషన్‌బియ్యాన్ని ఇతర ప్రాంతానికి అక్రమంగా తరలిస్తుండగా కొందరు గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో డీటీ గ్రామానికి చేరుకుని అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఆటోలో తరలిస్తున్న బియ్యాన్ని అధికారులు వస్తున్నారన్న సమాచారంతో వెంటనే మాయం చేశారు. అయితే బియ్యం నిల్వ ఉన్న ఇంటిని తాళం వేసి ఉంచడంతో పోలీసులను రప్పించి వారి సమక్షంలో పంచనామా నిర్వహించనున్నట్లు డీటీ తెలిపారు. దాదాపు 30 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

క్లుప్తంగా...


తిరుమల ఆలయంలోని ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న టీటీడీ ఈవో

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆనంద నిలయం మొదలుకుని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. కాగా, బుధవారం ఉగాది ఆస్థానం సందర్భంగా బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

సీఆర్డీఏ ప్రాంతంలోనూ పేదలకు ఇళ్లు

గెజిట్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపీ సీఆర్డీఏ) పరిధిలో నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌లో ఆర్–5 జోన్ ఏర్పాటు చేస్తూ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు, తుళ్లూరు మండలంలోని మందడం, ఐనవోలులో 900.97 ఎకరాలను ఆర్–5 జోన్‌గా నిర్ణయించింది. సీఆర్డీఏ పరిధిలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, నిరుపేదలకు అక్కడ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. సీఆర్డీఏ చట్టంలోని నిబంధనల ప్రకారం మొత్తం ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూమిలో ఐదు శాతం నిరుపేదలకు కేటాయించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాజధాని ప్రాంతంలోని ఆర్–5 జోన్‌లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఆర్డీఏ సిద్ధమవుతోంది. నెల రోజుల్లో 900.97 ఎకరాల్లో లేఅవుట్ సిద్ధం చేసి కలెక్టర్లకు అప్పగించనున్నట్లు సమాచారం. గతంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో దాదాపు 54 వేల మంది లబ్ధిదారులను గుర్తించారు. వారందరికీ ఆర్–5 జోన్‌లో ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నారు.

చదువులకు 'బలం'!

జగనన్న గోరుముద్దలో మరో పోషకాహారం: సీఎం జగన్

- బడి పిల్లలకు ఉదయం పూట రాగి జావ
- సమృద్ధిగా ఐరన్, కాల్షియంతో బాల్యానికి బలం
- ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో 38 లక్షల మందికి రాగి జావ
- మంచి మేనమామలా 15 రకాల పదార్థాలతో పిల్లలకు రుచికరమైన మెనూ



సాక్షి, అమరావతి: మన విద్యార్థులంతా భావి ప్రపంచంతో పోటీపడి రాణించేలా ప్రతి అడుగులోనూ వారికి అండదండలు అందిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పిల్లలకు మంచి మేనమామలా వారికి అందించే ఆహారం నుంచి ఉన్నత చదువులు, ఉద్యోగాల దాకా అన్ని విషయాల్లోనూ వారి బాగోగులే లక్ష్యంగా నడుస్తున్నామన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ కూడా పిల్లల బాగు కోసం ఇంత తపన పడలేదన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. 'మన ప్రభుత్వం రాక ముందు పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఇప్పుడెలా ఉన్నాయి..? ఒక సారి తేడాను గమనించండి. పిల్లలు ఏం తింటున్నారు? అని ఒక ముఖ్యమంత్రి ఆలోచన చేసిన పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. మనం చేయకపోతే ఇంకెవరు చేస్తారన్న మంచి ఆలోచనతో గోరుముద్దను చేపట్టాం. పిల్లలకు మంచి మేనమామలా 15 రకాల ఆహార పదార్థాలతో రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నాం. మధ్యాహ్న భోజనానికి గతంలో ఏడాదికి కేవలం రూ.450 కోట్లు కూడా ఖర్చు చేయని దుస్థితి. ఇప్పుడు గోరుముద్ద కోసం ఏడాదికి రూ.1,824 కోట్లు ఖర్చు చేస్తున్నాం'అని తెలిపారు. ఇప్పుడు దీనికి అదనంగా రాష్ట్రవ్యాప్తంగా 44,392 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 37,63,698 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో ఉదయం పూట రాగిజావ అందించే కార్యక్రమాన్ని మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఏప్రిల్‌లో పదో తరగతితో పాటు మిగిలిన పిల్లలకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో వారందరికీ ఓ మేనమామగా ఆల్ ద వెరీ బెస్ట్ చెబుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే...

మొదటి రోజు నుంచే..

అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజు నుంచి చదువులను సంస్కరించడంపై దృష్టి పెట్టాం. అందులో భాగంగానే గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. చదువుకునే విద్యార్థులను ప్రోత్సహిస్తూ అమ్మ ఒడి, విద్యాకానుక, నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు అందిస్తున్నాం. 8వ తరగతిలోకి వచ్చిన వెంటనే పిల్లలకు ట్యాబ్‌లు ఇస్తున్నాం. ఇక 6వ తరగతి నుంచి ప్రతి తరగతి గదిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ ప్యానెల్స్) ద్వారా డిజిటల్ బోధనను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు నాడు – నేడు పూర్తైన స్కూళ్లలో జూన్ నుంచి అమలులోకి తీసుకొస్తాం. ఇలా ప్రతి అడుగులోనూ పిల్లలను చేయిపట్టి నడిపిస్తున్నాం.

మరింత బలవర్థకంగా గోరుముద్ద

గోరుముద్దను ఇప్పటికే రోజుకొక మెనూతో రుచికరంగా అమలు చేస్తున్నాం. ఇప్పుడు మరింత బలవర్థకంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాం. ఇవాళ్టి నుంచి పిల్లలకు రాగిజావ కూడా అందిస్తూ గోరుముద్దను మరింత పుష్టికరంగా తీర్చిదిద్దుతున్నాం. రాగి జావ పిల్లల్లో సమృద్ధిగా ఐరన్, కాల్షియం కంటెంట్ పెరిగేలా దోహదపడుతుంది. మిడ్ డే మీల్స్ అంటూ గత ప్రభుత్వ హయాంలో మొత్తం సంవత్సరం అంతా కలిపినా కూడా ఏడాదికి రూ.450 కోట్లు కూడా మధ్యాహ్న భోజనానికి ఖర్చు చేయని దుస్థితి. అలాంటి అధ్వాన్నమైన పరిస్థితుల నుంచి గోరుముద్ద అనే కార్యక్రమం ద్వారా రోజుకొక మెనూతో పూర్తిగా మార్చి ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. గతంలో రూ.450 కోట్లు మాత్రమే ఉన్న బడ్జెట్‌ను ఇప్పుడు ఏడాదికి రూ.1,824 కోట్లకు పెంచి గోరుముద్ద కోసం ఖర్చు చేస్తున్నాం. ఇప్పుడు రాగి జావ కోసం అదనంగా మరో రూ.86 కోట్లు ఇస్తున్నాం. రోజుకో మెనూతో పిల్లలకు రుచికరమైన భోజనం అందిస్తున్నాం.

సత్యసాయి ట్రస్టు సహకారంతో..

పిల్లలకు రాగిజావ అందించే కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు భాగస్వామి కావడం నిజంగా మంచి పరిణామం. ఏటా దాదాపు రూ.86 కోట్లు ఖర్చయ్యే రాగి జావ కోసం సత్యసాయి ట్రస్టు రూ.42 కోట్లు అందిస్తుండగా మిగిలిన రూ.44 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరుస్తూ మంచి కార్యక్రమానికి ముందడుగు వేస్తున్నాం.

జనసేనతో పొత్తు ఉన్నా లేనట్లే

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కోరినా పవన్ స్పందించలేదు
- ఎమ్మెల్సీ మాధవ్ వెల్లడి



సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న తనకు మద్దతుగా బహిరంగ ప్రకటన చేయాలని స్వయంగా మిత్రపక్ష జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను కోరినా ఆయన స్పందించలేదని.. క్షేత్ర స్థాయిలో కలిసి పనిచేసే పరిస్థితి లేనప్పుడు బీజేపీ–జనసేన 'కలిసి ఉన్నా లేనట్లే'అని శాసనమండలిలో బీజేపీ పక్ష నాయకుడు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ ఘాటుగా స్పందించారు. పొత్తులో కొనసాగుతున్నప్పటికీ జనసేన ఎక్కడా బీజేపీ అభ్యర్థులకు మద్దతు తెలపని అంశంపై మంగళవారం విజయవాడలో జరిగిన బీజేపీ రాష్ట్ర పదాధికారులు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఇన్‌చార్జిల సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. సమావేశంలో చర్చించిన అంశాలను మాధవ్ వెల్లడించారు. 'మేం జనసేనతో కలిసి ఉన్నా లేనట్లేనన్న వాతావరణం ఉంది. ఇటీవల పవన్ కూడా జనసేన–బీజేపీ పొత్తు ఉంది అన్నారు. అయితే, క్షేత్రస్థాయిలో కలిసి పనిచేయడం లేదన్నది వాస్తవం. నిజంగా పొత్తులో ఉంటే క్షేత్రస్థాయిలో కూడా కలిసి పనిచేయాలని కోరుతున్నాం'.. అని మాధవ్ వ్యాఖ్యానించారు. 'కలిసి పనిచేస్తే ప్రజా మద్దతు రెండు పార్టీలకు ఉంటుంది. ఆయనా (పవన్) నమ్మాలి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రకటన చేయాలని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు కోరారు. కానీ, ప్రకటన రాలేదు'.. అని మాధవ్ చెప్పారు. కలిసి పనిచేసే విషయంలో బీజేపీ నుంచే స్పందనలేదని పవన్‌కళ్యాణ్ అంటున్నారని విలేకరులు ప్రశ్నించగా.. 'ఆయన వైపు నుంచే స్పందనలేదు'అని బదులిచ్చారు.

తవ్వేకొద్దీ బయటపడుతున్న

మార్గదర్శి మోసాలు

రూ.459.98 కోట్లను దారి మళ్లించినట్లు ఇప్పటికే ఆడిట్‌లో నిర్ధారణ

- తాజాగా మరిన్ని అక్రమాలు బట్టబయలు
- ప్రతి గ్రూపులో పాడుకునే రెండో నెల పాటకు ఎటువంటి చందా కట్టని వైనం
- ఖాళీ చిట్లకు చెల్లించాల్సిన చందాలకు ఎగనామం
- ఇవేమీ చెల్లించకుండానే ప్రతి గ్రూపుపైనా ప్రతి నెలా 5 శాతం కమీషన్ స్వీకరణ
- గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వెలుగులోకి
- ఈ ఉల్లంఘనలపై ఆయా బ్రాంచ్‌ల వివరణ కోరిన రిజిస్ట్రేషన్ల శాఖ



సాక్షి, అమరావతి: ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాలు తవ్వే కొద్దీ బయటపడుతూనే ఉన్నాయి. ఇప్పటికే రూ.459.98 కోట్ల సొమ్మును చట్టవిరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, షేర్లు, తదితరాల్లోకి మళ్లించినట్లు ఆడిటింగ్‌లో అధికారులు నిర్ధారించారు. తద్వారా చందాదారుల సొమ్మును తమ వ్యక్తిగత లబ్ధి కోసం రామోజీరావు, ఆయన కోడలు, మార్గదర్శి ఎండీ శైలజ వినియోగించుకున్నట్లు స్పష్టమైంది. తాజాగా ప్రతి చిట్ గ్రూపులో ఖాళీ చిట్లు, కంపెనీ పాడుకునే రెండో నెల చిట్ల లావాదేవీల్లోనూ భారీగా అవకతవకలకు పాల్పడినట్లు తేలింది. మార్గదర్శి మేనేజర్లు సమర్పించిన మినిట్స్‌ను విశ్లేషించిన ఆడిట్ అధికారులు ఈ మోసాలను గుర్తించారు. ఖాళీ చిట్లకు గానీ, ప్రతి చిట్ గ్రూపులో కంపెనీ పాడుకునే రెండో నెల చిట్‌కు సంబంధించి గానీ ఎటువంటి సొమ్ము (నెల వారీ చందా) చెల్లించలేదని వెల్లడైంది. ప్రతి చిట్ గ్రూపులో రెండో నెల చిట్ పాటను కంపెనీయే పాడుకునే అవకాశం ఉంది. అందుకోసం అందరి చందాదారుల మాదిరిగానే కంపెనీ కూడా చందా కట్టాలి. కానీ చందా కట్టకుండానే ఆ రెండో నెల చిట్‌ను పాడుకుని కంపెనీ జమ చేసుకుంటోంది. కంపెనీ తరఫున కట్టాల్సిన ఎటువంటి చందాలు కట్టకుండానే ప్రతి నెలా ప్రతి గ్రూపు నుంచి 5 శాతం కమీషన్‌ను తీసుకుంటోంది.

ఆధారాలతో సహా వెలుగుచూసిన అక్రమాలు

గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని పలు మార్గదర్శి యూనిట్లలో ఈ మోసాలు ఆధారాలతో సహా బయటపడ్డాయి. గుంటూరు జిల్లాలో ఐదు చిట్ గ్రూపులను విశ్లేషించగా వాటి ద్వారా రూ.1.18 కోట్లను చిట్ కమీషన్‌గా, రూ.1.73 కోట్లను రెండో నెల పాడుకున్న చిట్ సొమ్ముగా కంపెనీ జమ చేసుకుంది. కానీ పాడుకున్న రెండో నెల చిట్ చందా.. అలాగే ఆ గ్రూపులో తన పేరు (ఫోర్‌మెన్) మీద ఉంచుకున్న ఖాళీ చిట్లకు చెల్లించాల్సిన చందా సొమ్ము రూ.6.98 కోట్లు చెల్లించలేదని అధికారులు గుర్తించారు. విజయనగరం జిల్లాలో 12 చిట్ గ్రూపులను విశ్లేషించినప్పుడు ఫోర్‌మెన్ కమీషన్ రూ.60.50 లక్షలు, రెండో నెల పాడుకున్న చిట్ మొత్తం రూ.1.05 కోట్లను కంపెనీ ఖాతాలో వేసుకున్నారు. కానీ వాటికి సంబంధించి కట్టాల్సిన రెండో నెల చిట్ చందాలు, కంపెనీ పేరు మీద ఉన్న ఖాళీ చిట్ల చందాల మొత్తం రూ.54.85 లక్షలు కట్టలేదని తేలింది. అలాగే శ్రీకాకుళం జిల్లాలో 28 చిట్ గ్రూపులను పరిశీలించినప్పుడు వాటికి ఫోర్‌మెన్ కమీషన్ రూ.3.47 కోట్లు, రెండో నెల పాడుకున్న చిట్ల మొత్తం రూ.2.73 కోట్లను కంపెనీ తీసుకుంది. కానీ వాటికి సంబంధించి కట్టాల్సిన రూ.2.88 కోట్ల చందా సొమ్మును కట్టలేదు.

భారీగా ఉల్లంఘనలు..

నెల వారీగా చందాదారులతోపాటు కట్టాల్సిన సొమ్మును కట్టకుండానే కమీషన్ తీసుకోవడం, ప్రతి గ్రూపులోనూ చందా కట్టకుండానే రెండో నెల చిట్‌ను పాడుకుని ఆ సొమ్మును తీసుకోవడం ద్వారా మార్గదర్శిలో చిట్లు వేసిన వారిని రామోజీరావు, ఆయన కోడలు శైలజ మోసం చేసినట్లు స్పష్టమైంది. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల సొమ్మును పణంగా పెట్టి భారీగా ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. ఖాళీగా ఉన్న చిట్లకు సంబంధించి ఎటువంటి చందా చెల్లించకుండా మిగిలిన చందాదారులను మభ్యపెట్టినట్లు తేలింది. ఈ ఉల్లంఘనలకు సంబంధించి వివరణ ఇవ్వాలని సంబంధిత మార్గదర్శి బ్రాంచ్‌లను ఆదేశించినట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ రామకృష్ణ తెలిపారు.

గవర్నర్ ఉగాది విందుకు కొల్లాపూర్ విద్యార్థి



కొల్లాపూర్: గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఇచ్చిన ఉగాది విందుకు కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాలకు చెందిన ఎంఏ తెలుగు విద్యార్థిని పార్వతమ్మ సోమవారం హాజరయ్యారు. పార్వతమ్మ గతంలో జీ–20 గ్లోబలైజేషన్ యువ ఉపన్యాస పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. దీంతో ఆమెకు గవర్నర్ కార్యాలయం నుంచి విందుకు హాజరుకావాలని ఆహ్వానం అందింది. ఆమెతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ మార్క్ పోలోనియస్ కూడా విందుకు హాజరయ్యారు. గవర్నర్ విందుకు ఆహ్వానం అందడంపై కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు శోభకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నామ సంవత్సరంలో ప్రజలందరు సుఖ, సంతోషాలు, శాంతి, సౌభాగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశమంతటా విస్తరించాలని కోరారు. ఈ సంవత్సరంలో రాష్ట్రం మరింత ప్రగతి సాధిస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అలాగే జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

జూరాల ఎడమ కాల్వకు నీటి నిలిపివేత

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా నీటిని నిలిపివేసారు. సమాంతర కాల్వ ద్వారా 152 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 80 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రసీల్‌రెడ్డి తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు అలంపూర్‌లో తిరుగులేదు..

- చల్లా రాకతో అధిక మెజార్టీ లక్ష్యం
- కేసీఆర్ ఆదేశాల ప్రకారం నాయకులు ఐకమత్యంగా మెలగాలి
- జోగుళాంబ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్‌రావు

శాంతినగర్: బీఆర్‌ఎస్‌లోకి చల్లా రాకతో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అలంపూర్‌లో గెలుపు తథ్యమని, అందరూ సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించి చరిత్ర తిరగరాయాలని జోగుళాంబ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్‌రావు పిలుపునిచ్చారు. వడ్డేపల్లి మండల పరిధిలోని తనగలలో ఆర్డీఎస్ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డా.అబ్రహం అధ్యక్షతన వడ్డేపల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయసమ్మేళన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ఎమ్మెల్సీలు రవీందర్‌రావు, చల్లావెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహం, కన్సూమర్ ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్పను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా ఊరేగించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడారు. ఎన్నికలు నవంబర్‌లో వస్తాయని, క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడానికి సీఎం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారన్నారు.

పాలమూరుకే వలసలు..

పాలమూరు జిల్లా గతంలో వెనుకబడిన జిల్లాగా ఉండేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక సాగునీరు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతు బంధు పథకాలతో వ్యవసాయం పండగయిందన్నారు. దీంతో పాలమూరుకు ఇతర రాష్ట్రాల నుంచి వలసలు వస్తున్నారన్నారు.

రిజర్వాయర్ల నిర్మాణానికి కృషి..

అలంపూర్ నియోజకవర్గంలోని ఆర్డీఎస్ ఆయకట్టు రైతులను ఆదుకునేందుకు రిజర్వాయర్‌లు అవసరమని రైతులు కోరుతున్నారని, రైతుల కోరిక మేరకు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో గతంలో సీఎంని కలిశామని, మరోసారి ముఖ్యనేతలందరం సీఎంని కలిసి మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి కృషిచేసి సాగునీటి సమస్యలేకుండా చూస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

మహిళా సాధికారత..

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మహిళా సాధికారత చేకూరిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో పథకాలు చేపట్టిందని, పుట్టిన బిడ్డ నుంచి చనిపోయిన వారి వరకు ఎన్నో పథకాల ద్వారా లబ్ధి చేకూర్చుతోందన్నారు.

గెలుపు కోసం కృషి..

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాబోయే ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. రైతుల సాగునీటి సమస్య, తుమ్మిళ్ల లిఫ్ట్ కింద రిజర్వాయర్ నిర్మాణంపై సీఎంని గతంలో కలిశామని, మరోసారి సీఎం దృష్టికి సమస్య తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తామన్నారు.

దేశంలో లేని సంక్షేమ పథకాలు..

దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని ఎమ్మెల్యే డా.అబ్రహం అన్నారు. ప్రజల కోసం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్మన్ జంబు రామన్‌గౌడ్, జోగుళాంబ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, అలంపూర్ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కాశపోగు రాజు, సుగుణమ్మ, రజిత, వడ్డేపల్లి కరుణ, మనోరమ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

'కురుమూర్తి'లో భక్తుల రద్దీ


కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన అమ్మపూర్ కురుమూర్తి స్వామి దర్శనానికి అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఉదయం నుంచే తరలివచ్చి క్యూలైన్లో నిల్చున్నారు. మెట్లపై దీపాలు వెలిగిస్తూ.. గోవింద నామస్మరణలతో స్వామి చెంతకు చేరి కొబ్బరికాయలు కొట్టి దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామికి సమర్పించి వేడుకున్నారు. అనంతరం కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణమంత భక్తుల రద్దీతో కనిపించింది. వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

31న బార్ అసోసియేషన్ ఎన్నికలు

జడ్చర్ల టౌన్: ఈ నెల 31న జడ్చర్ల బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ధనాల తిరుపతి తెలిపారు. ప్రస్తుత బార్ అసోసియేషన్ కాలపరిమితి ముగియనున్నందున ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి 23, 23 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 25న వాటి పరిశీలన, 26న ఉపసంహరణలకు అవకాశం ఇచ్చారు. అదే రోజు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. 31 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఓటింగ్, 3 గంటలకు కౌంటింగ్ ప్రారంభించి ఫలితాలు వెల్లడించనున్నారు.

భార్యతో కలిసి కన్నతల్లిని చంపిన కొడుకు?

- వనపర్తి జిల్లా అమడబాకులలో ఘటన


శంకరమ్మ (ఫైల్)

కొత్తకోట: భార్యతో కలిసి ఓ కొడుకు కన్నతల్లిని చంపాడని ఆరోపిస్తూ గ్రామస్తులందరూ భార్యాభర్తలను చితకబాదారు. ఈ సంఘటన మంగళవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని అమడబాకులలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శంకరమ్మ(63)తో కొడుకు జేసీబీ రాములు, కోడలు శివమ్మ తరుచుగా గొడవపడేవారు. ఇటీవల కోడలు కొట్టడం వల్లే శంకరమ్మ కాలు విరిగి నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైంది. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం శంకరమ్మ ఇంటి ముందు ఉన్న సంపులో పడి మృతిచెందిందని తెలియడంతో గ్రామస్తులు ఒక్కసారిగా శంకరమ్మ కోడలు, కొడుకు ఉంటున్న ఇంటిపై రాళ్లతో దాడి చేసి.. ఇద్దరిని పట్టుకుని చితకబాదారు. విషయం తెలుసుకున్న కొత్తకోట ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని కొడుకు రాములు, కోడలు శివమ్మను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. శంకరమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై శంకరమ్మ కూతురు చెవిటి బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

'గ్రామాల్లో అవినీతి రాజ్యమేలుతోంది'


ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మంగళ హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

తాడూరు: బీఆర్‌ఎస్ పాలనలో అక్రమాలకు గ్రామాలు నిలయంగా మారాయని, అవినీతి రాజ్యమేలుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని పాపగల్, సిర్సవాడ, బలాన్‌పల్లి గ్రామాల్లో పర్యటించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపగల్‌లో ప్రభుత్వం గతంలో దళితులకు ఇచ్చిన భూముల్లోని నల్లమట్టిని స్థానిక నాయకులు విక్రయించి అక్రమంగా సంపాదించారన్నారు. సిర్సవాడ, తాడూరు మండల కేంద్రంలో పాఠశాల భవన నిర్మాణాల పేరుతో ఇసుకను విక్రయించారన్నారు. ఇసుక విక్రయంతోనే పాఠశాలల నిర్మాణాలను చేపట్టడం జరిగిందన్నారు. ఒకప్పుడు గ్రామాలు పచ్చనిపొలాలతో కళకళలాడేవని, ప్రస్తుతం బీఆర్‌ఎస్ నాయకుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. పల్లెప్రగతిలో భాగంగా సర్పంచ్‌లు చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో సర్పంచ్‌ల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. లిక్కర్ స్కాంలో ఇరికిన ఎమ్మెల్సీ కవితను కాపాడుకోవడంలోనే నిమగ్నమై.. గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శించారు. స్థానికంగా ఉండే బీఆర్‌ఎస్ నాయకుల అక్రమాలు మితిమీరిపోయాయన్నారు. అనంతరం సిర్సవాడ, బలాన్‌పల్లి, ఐతోల్ గ్రామాల్లో పర్యటన సందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కుమార్, నాయకులు రామకృష్ణ, పృథ్వీరాజ్, శివశంకర్, రామకృష్ణ, రాములమ్మ, బాలు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతారహిత్యం వల్లే పేపర్ లీక్

పాలమూరు: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ రాష్ట్రప్రభుత్వ నిర్వాకమేనని, లీకేజీల వ్యవహారంలో కొంత మంది వ్యక్తులపై మోపి ప్రభుత్వం తప్పించుకోవాలని చూడటం సరైన చర్యకాదని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం బాధ్యతారహిత్యంగా నిరుద్యోగుల జీవితాలను అంధకారంలోకి నెట్టివేసినట్లు మండిపడ్డారు. ప్రభుత్వం దేశ యువత కోసం ఉద్యోగ హక్కు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

మార్కెట్‌కు వరుస సెలవులు

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు వరుస సెలవులు ఇచ్చారు. మంగళవారం అమావాస్య కారణంగా మార్కెట్ బంద్ చేశారు. బుధవారం ఉగాది పండుగ సందర్భంగా సెలవు ఇవ్వగా గురువారం కనుమ సెలవు ఇచ్చారు. వరుసగా మూడురోజుల పాటు మార్కెట్‌లో లావాదేవీలు జరగవని అధికారులు తెలిపారు. తిరిగి శుక్రవారం మార్కెట్‌లో టెండర్లు వేస్తారని చెప్పారు. బుధవారం జరిగే ఉల్లి పాయల వేలం వాయిదా పడిందని రైతులు ఈ విషయం గమనించాలని కోరారు.